అరకు అసెంబ్లీకి ఆరు నామపత్రాలు

రిటర్నింగ్ అధికారి, ఐటిడి ఏ పి.ఓ. వి.అభిషేక్

విశాలాంధ్ర-బ్యూరో పాడేరు : అరకు వ్యాలీ అసెంబ్లీ నియోజకవర్గం అభ్యర్థిత్వానికి ఆరు నామినేషన్లు దాఖలయ్యాయని అరకు వ్యాలీ అసెంబ్లీ నియోజక వర్గం రిటర్నింగ్ అధికారి, ఐటిడిఏ పి.ఓ. వి.అభిషేక్ మంగళ వారం ఒక ప్రకటనలో తెలియజేసారు. స్వతంత్ర అభ్యర్థులు చెండా ఎలియా, సివేరి అబ్రహాం, వంతాల రామన్న, నరాజి మధుబాబు, మర్రి ఉషారాణి నామి నేషన్లను సమర్పించారు. జైభారత్ నేషనల్ పార్టీ అభ్యర్థిగా బురిడి ఉపేంద్ర నామపత్రాన్ని దాఖలు చేసారనీ చెప్పారు.

సిపిఎం అరకు పార్లమెంట్ అభ్యర్థి అప్పలనర్సయ్యకే మీఓటు

ఏ.దారకొండ పంచాయతీ ప్రజలు

విశాలాంధ్ర-జీకే వీధి : రాజ్యాంగ పరిరక్షణ, గిరిజన హక్కులు చట్టాలు రక్షణకు అండగ, పోరాడే సిపిఎం ఎంపి అభ్యర్థి అప్పలనర్సయ్యకే మీఓటు అని జీకే వీధి మండలం ఎ.దారికొండ పంచాయతీ గొల్లపల్లి, పెబ్బంపల్లి, తడకపల్లి, గ్రామాల ప్రజలతో సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సమవేశంకి ఎదారకొండ వైస్ సర్పంచ్ ముర్ల చంటిబాబు అధ్యక్షతన జరిగింది. ఈసమావేశంకి స్థానిక ఎంపిటిసి బుజ్జిబాబు మాట్లాడుతూ దేశంలో పరిపాలన సాగిస్తున్న బిజెపి ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలు, వివరించారు. ప్రదానంగా గిరిజన చట్టాలు, హక్కులు, రిజర్వేషన్ లను రక్షణకు అరుకు పార్లమెంటు అభ్యర్థిగా పోటీ చేస్తున్న ప్రజా ఉద్యమ నాయకుడు పాసిపెంట అప్పలనర్సయ్యకు, తమ అమూల్యమైన ఓటు వేసి పార్లమెంటుకి పంపాలని ప్రజలకు కోరారు. ఈ కార్యక్రమనికి ఎ.దారకొండ, ముర్ల రామారావు, చిట్టిబాబు పెద్దబాబు, చిన్నాబ్బయి, వివిధ గ్రామల ప్రజలు పాల్గొన్నారు.

అరకు వైసిపి రెబల్ అభ్యర్థిగా నేడు భవాని నామినేషన్

విశాలాంధ్ర-అరకు: వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అరకు నియోజకవర్గం ఎమ్మెల్యే రెబల్ అభ్యర్థిగా సమార్ధి భవాని బరిలో నిలవనున్నారు. ఈ మేరకు బుధవారం ఆమె నామినేషన్ వేయనున్నారు. నామినేషన్ కార్యక్రమం సందర్భంగా భారీ ర్యాలీగా ఆమె అనుచరులు తరలి వెళ్లేందుకు చురుగ్గా ఏర్పాట్లు సాగుతున్నాయి. తన అభిమానులు, శ్రేయోభిలాషులు అందరూ బుధవారం జరగబోయే తమ నామినేషన్ కార్యక్రమానికి హాజరు కావలసిందిగా ఆమె ఈ సందర్భంగా కోరారు.

పదవ తరగతి ఫలితాల్లో మండల టాపర్‌గా యశ్వంత్ నాయుడు

సెయింట్ ఆన్స్ పాఠశాల విద్యార్థులకు మండలంలో ప్రథమ, ద్వితీయ స్థానాలు

ప్రథమ స్థానం దక్కించుకున్న యశ్వంత్ నాయుడు, ద్వితీయ స్థానంలో టీజ అన్విత

విశాలాంధ్ర-చింతపల్లి : పదవ తరగతిలో చింతపల్లి మండల టాపర్‌గా చింతపల్లి మండల కేంద్రానికి చెందిన నిరుపేద కుటుంబానికి చెందిన వ్యాన్ డ్రైవర్ జామి దేముడు, దేవి దంపతుల కుమారుడు జామి దుర్గా వెంకట యశ్వంత్ నాయుడు పదవ తరగతి ఫలితాల్లో మండలంలోనే టాపర్ గా నిలిచాడు. స్థానిక సెయింట్ ఆన్స్ పాఠశాలలో విద్యను అభ్యసించిన యశ్వంత్ నాయుడు పాఠశాలలోనే గాక మండలంలో ప్రథమ స్థానంలో నిలిచాడు. అదే పాఠశాలలో పదవ తరగతి విద్యను అభ్యసిస్తున్న వంతల టీజ అన్విత మండలంలో ద్వితీయ స్థానంలో నిలిచిందని మండల విద్యాశాఖ అధికారి పనసల ప్రసాద్ అన్నారు. స్థానిక సెయింట్ ఆన్స్ ఉన్నత పాఠశాలలో విద్యనభ్యసించిన వీరు పదో తరగతి పరీక్షలు రాసి 600 మార్కులకు గాను యశ్వంత్ నాయుడు 558, టీజ అన్విత 557 మార్కులు సాధించి మండలంలోనే అత్యధిక మార్కులు సంపాదించిన విద్యార్థులుగా ప్రతిభ కనబరిచారు. టీజ అన్విత తండ్రి విజయరాజు కోర్టు ఉద్యోగి కాగా, తల్లి స్వరూప ఉపాధ్యాయురాలిగా ఉన్నారు. పదో తరగతి ఫలితాల్లో అత్యధిక మార్కులు సాధించిన వీరిద్దరిని ఆయన అభినందించారు. యశ్వంత నాయుడు, అన్వితలు ఉత్తమ ప్రతిభ కనబరిచి అత్యధిక మార్కులు సంపాదించి మండలంలోనే టాపర్ లుగా నిలవడంతో ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు వారిని అభినందించారు.

ఆలస్యంగా వెలుగు చూసిన మహిళ మృతదేహం

చెరపల్లి అడవిలో మహిళా మృతదేహం లభ్యం

అడ్డపిక్కల కోసం వెళ్లి మృత్యువాత పడిన వృద్ధురాలు రాజులమ్మ

విశాలాంధ్ర-చింతపల్లి : అడ్డపిక్కల కోసం అడవికి వెళ్లి గడచిన ఐదు రోజులుగా ఇంటికి చేరని వృద్ధురాలు వంజరి రాజులమ్మ ఎట్టకేలకు మృతదేహమై కనిపించింది. ఆలస్యంగా అందిన సమాచారం మేరకు అల్లూరి జిల్లా జీకే వీధి మండలం వనబలింగి గ్రామానికి చెందిన వంజరి రాజులమ్మ గత ఐదు రోజుల క్రితం అడ్డపిక్కలు ఏరుకొను నిమిత్తం ఇంటి నుండి బయలు దేరి అడవికి వెళ్ళిందని, నాటినుండి ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు ఆమె కోసం గాలిస్తున్న నేపథ్యంలో సోమవారం చెరపల్లి అటవీ ప్రాంతంలో ఆమె మృతదేహం లభ్యమయింది. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

ఫైబర్ నెట్ వైర్లను కత్తిరించడంపై పోలీసులకు ఫిర్యాదు

విశాలాంధ్ర- హుకుంపేట : మండల కేంద్రానికి కూత వేటు దూరంలో ఏపీ ఫైబర్ నెట్ ఓ ఎఫ్ సి వైర్లను గుర్తు తెలియని వ్యక్తులు కత్తిరించడంతో (ఇంటర్నెట్, ఫోన్, టీవీ చానల్స్) ట్రిపుల్ ప్లే సేవలకు అంతరాయం ఏర్పడిందని స్థానిక కేబుల్ ఆపరేటర్ వి విశ్వేశ్వరరావు మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. హుకుంపేట చెరువు గుట్టకు సమీపంలో సోమవారం రాత్రి వైరు కత్తిరించారని, మంగళవారం ఉదయం స్పేసింగ్ చేసి సిగ్నల్ ను పునరుద్ధించామన్నారు. మళ్లీ మంగళవారం సాయంత్రం సమయంలో కావాలని, కుట్రతో ఇదే రంగంలో ఉన్నవారు కత్తిరించినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. ప్రభుత్వ పథకమైన ఏపీ ఎస్ ఎఫ్ ఎల్ పై ఆధారపడిన రెండు మండలాలకు చెందిన అనేక గ్రామాలలో, వందలాది వినియోగదారులు గత రెండు రోజులుగా తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. ఈ పథకం ద్వారా ప్రభుత్వ కార్యాలయాలు, హాస్టల్స్, పాఠశాలలు, సచివాలయాలు, ప్రైవేటు ఆర్గనైజేషన్, గృహ వినియోగదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారన్నారు. ముఖ్యంగా ఎన్నికలు సమయం, విద్యార్థుల పరీక్షల కీలక సమయంలో వైర్లను కత్తిరించడం తో ఫోన్ చేసి విషయం తెలియక నానా మాటలు అంటున్నారన్నారు. ప్రభుత్వం అందించే చౌకైనా, నాణ్యమైన సేవలకు అంతరాయం కలిగిస్తూ, వైర్లు ధ్వంసం చేసి ఆర్థికంగా నష్టపరిచిన వ్యక్తులపై చర్యలు తీసుకుని మళ్లీ ఇటువంటి అంతరాయ సమస్య ఏర్పడకుండా న్యాయం చేయాలని పోలీసులకు విన్నవించుకున్నట్లు విశ్వేశ్వరరావు తెలిపారు.

కేంద్రమంత్రితో కలిసి అరకు పార్లమెంట్ ఎంపీ అభ్యర్థిగా గీత నామినేషన్ దాఖలు

విశాలాంధ్ర-పార్వతీపురం : అరకు పార్లమెంటు ఎంపీ అభ్యర్థిగా బిజెపి, టిడిపి, జనసేన ఉమ్మడిఅభ్యర్థిగా కొత్తపల్లి గీత నామినేషన్ పత్రాన్ని దాఖలు చేశారు. కేంద్ర గ్రామీణాభివృద్ధిశాఖ సహాయమంత్రి పగ్గన్ సింగ్ కులస్తేతో కలసి పాత బస్టాండ్ నుండి ర్యాలీగా విచ్చేసి పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జిల్లా రిటర్నింగ్ అధికారైన కలెక్టర్ నిషాంత్ కుమార్ కు ఆమె నామినేషన్ పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో సహాయ రిటర్నింగ్ అధికారయిన జాయింట్ కలెక్టర్ ఎస్ఎస్ శోబిక పాల్గొన్నారు. నామినేషన్ ర్యాలీ కార్యక్రమంలో కూటమి ఎమ్మెల్యే అభ్యర్థులైన పాంగి రాజారావు, బోనెల విజయ్ చంద్ర,కిల్లు రమేష్ నాయుడు, మిరియాల శిరీష, గుమ్మడి సంధ్యరాణి, నిమ్మక జయకృష్ణ, మాజీ ఎమ్మెల్సీ జగదీష్, మాజీ ఎమ్మెల్యేలు భంజదేవ్, బొబ్బిలి చిరంజీవులు, బీజేపీ నాయకులు ద్వారపురెడ్డి శ్రీనివాస రావు, సురగాల ఉమా మహేశ్వరరావు, జనసేన నియోజక వర్గ ఇంచార్జి ఆదారు మోహనరావు, చందక అనిల్, పార్వతీపురం పట్టణ టీడీపీ అధ్యక్షుడు రవికుమార్ తదితరులతో పాటు టీడీపీ, బీజేపి, జనసేన నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, శ్రేయోభిలాషులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

వీరేష్ దేవ్‌ను ప్రశంసించిన చంద్రబాబు

విశాలాంధ్ర-కురుపాం : కురుపాం నియోజకవర్గం తెలుగుదేశం పార్టీలో ఉత్సాహంగా పనిచేస్తున్న యువ నాయకుడు వైరిచర్ల వీరేష్ చంద్రదేవ్ మంగళవారం విశాఖ జిల్లాలో పర్యటిస్తున్న చంద్రబాబునాయుడును మర్యాద పూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా నియోజకవర్గంలో పార్టీ అంచెలంచెలుగా అభివృద్ధి, నామినేషన్ విజయవంతం చేయడంపై పూర్తి సమాచారం అందుకున్న అధినేత వీరేష్ చంద్ర దేవ్ పనితీరు ను ప్రశంసించారు. ఉమ్మడి అభ్యర్థి తోయక జగదీశ్వరి అఖండ విజయం సాధించేందుకు సమన్వయంతో పనిచేయాలని కష్టపడి పనిచేసే వారందరికీ మంచి భవిష్యత్తు ఉంటుందని తెలిపారు.

పదోతరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు కలెక్టర్ అభినందనలు

విశాలాంధ్ర-పార్వతీపురం : పదవ తరగతిలో జిల్లా స్థాయిలో గరిష్ఠ మార్కులు సాధించిన విద్యార్థులకు జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ అభినందనలు తెలిపారు. విజేతల మధ్య కేకును కోసి అందరికీ పంచిపెట్టారు. 96.37 శాతంతో జిల్లా రాష్ట్రంలో ప్రథమ స్థానంలో నిలిచింది. 210 పాఠశాలల్లో 96 పాఠశాలలు శతశాతం ఉత్తీర్ణత సాధించాయన్నారు.టి ఆర్ ఎం మునిసిపల్ ఉన్నత పాఠశాల విద్యార్థి కంచారి బన్నదుగారి గౌతమి 591 మార్కులతో జిల్లాలో ప్రథమ స్థానంలో నిలవగా,ఎం సింగుపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి సవిరిగాన మనోజ్ కుమార్ 588 మార్కులతో 4వ స్థానం, నీలానగరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి దుప్పాడ సంజన 587 మార్కులతో ఏడవ స్థానంలో నిలిచినట్లు తెలిపారు. ఎన్నికల నామినేషన్ల సమయంలో పదో తరగతి ఫలితాలు గొప్ప సంతృప్తినిచ్చాయని చెప్పారు. తాను ప్రవేశపెట్టిన మై స్కూల్ మై ప్రైడ్ కూడా దోహద పడిందన్నారు.స్టేట్ లో ప్రథమ స్థానాన్ని సాధించడం పట్ల జిల్లా కలెక్టరును ఉత్తమ ఫలితాలు సాధించిన వారు, జిల్లాఅధికారులు సత్కరించి అభినందించారు.ఈకార్యక్రమంలో జిల్లా కలెక్టర్ సతీమణి కరుణ, జాయింట్ కలెక్టర్ ఎస్ ఎస్ శోభిక, జిల్లా రెవిన్యూ అధికారి జి కేశవనాయుడు, ఎస్డిసి ఆర్ వి సూర్యనారాయణ, జిల్లా విద్యాశాఖాధికారి జి పగడాలమ్మ, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి బి. జగన్నాథ రావు, జిల్లా ఆసుపత్రుల సమన్వయ అధికారి డా.బి. వాగ్దేవి, జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ కె. రామ చంద్రరావు, జిల్లా ఆర్.డబ్ల్యు.ఎస్ ఇంజినీరింగ్ అధికారి ఓ.ప్రభాకరరావు, జిల్లా పశుసంవర్ధక అధికారి ఎస్.మన్మథరావు, జిల్లా గ్రామ పంచాయతీ అధికారి బలివాడ సత్యనారాయణ, జిల్లా మత్స్య శాఖ అధికారి వి. తిరుపతయ్య, జిల్లా ప్రణాళిక అధికారి పి.వీరరాజు, జిల్లా సాంఘిక సంక్షేమ సాధికారిత అధికారి ఎం.డి. గయాజుద్దీన్, జిల్లా నైపుణ్య అభివృద్ధి సంస్థ అధికారి యు.సాయికుమార్, తదితరులు పాల్గొన్నారు.

పాలకొండ శాసనసభ రిటర్నింగ్ అధికారిగా జాయింట్ కలెక్టర్ శోభిక

విశాలాంధ్ర-పార్వతీపురం/సీతంపేట : పార్వతీపురం మన్యం జిల్లాలోని పాలకొండ శాసనసభకు రిటర్నింగ్ అధికారిగా జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్ఎస్ శోభిక మంగళవారం బాధ్యతలు తీసుకున్నారు. ఇంతవరకు ఇక్కడ రిటర్నింగ్ అధికారిగా వ్యవహరించిన సీతంపేట ఐటీడీఏ ప్రాజెక్టు ఆఫీసరయిన ఐఏఎస్ అధికారి కల్పనాకుమారిను అకస్మాత్తుగా బదిలీ చేస్తూ తక్షణమే జీఏడికి రిపోర్ట్ చేయాలని చీఫ్ సెక్రటరీ జవహార్ రెడ్డి ఆదేశాలు జారీ చేశారు. దీంతో ఉత్తర్వులు అందిన మరుక్షణమే కల్పన కుమారి రిలీవ్ అవ్వగా,జాయింట్ కలెక్టర్ ఎస్ఎస్ శోభిక రిటర్నింగ్ అధికారిగా బాధ్యతలు చేపట్టారు. ఆకస్మిక బదిలీపై రకరకాల ఊహాగానాలు వినిపిస్తున్నాయి. ఎన్నికల నియమావళి అమలులో ఉండటంతో దీనిపై ఎటువంటి ప్రకటనలు చేయకపోవడం గమనార్హం. మంచిఅధికారికి బదిలీ జరగడం దురదృష్టకరమని, ఎన్నికల సమయంలో ఎన్నికల విధుల్లో ఉంటున్న అధికారిని ఆకస్మాత్తుగా బదిలీచేయడంలో ఉన్న ఆంతర్యం ఏమిటో ఎవరికి అర్థం కావడం లేదు. ఆమె బదిలీపై ఎవరు స్పందించకపోవడం గమనార్హం.పాలకొండ శాసనసభ నియోజకవర్గం నామినేషన్లను పాలకొండలోని ఆర్డీవో కార్యాలయం ఉండగా అక్కడ ఏర్పాటుచేయకుండా సీతంపేట ఐటిడిఏ కార్యాలయంలో ఏర్పాటుచేయడంవలన బదిలీ జరిగి ఉంటుందని కొంతమంది గుసగుసలాడుకుంటున్నారు.

నూతన ఐటీడీఏ పీవోగా బాధ్యతలు... ఐటిడిఏ నూతన ప్రాజెక్టు అధికారి మరియు పాలకొండ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారిగా పూర్తి అదనపు బాధ్యతలు స్వీకరించిన పార్వతీపురం మన్యం జిల్లా జాయింట్ కలెక్టర్ శోభిక. ఇప్పటివరకు సీతంపేట ఐటిడిఏ పిఓగా విధులు నిర్వహించిన కల్పనకుమారి ప్రభుత్వం అమరావతిలో రిపోర్ట్ చేయాలని ఉత్తర్వులు జారీ చేస్తూ అకస్మాత్తుగా బదిలీ చేసింది. కల్పనకుమారి తనదైన ముద్రతో విధులు నిర్వహిస్తూ ఇటు అధికారి యంత్రాంగాన్ని, అభివృద్ధిని సాధిస్తూ ముందుకు వెళ్లారు. ఇప్పటివరకు ఏవో అందించే సేవలను అధికారులు కొనియాడారు.

ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని డీఎంహెచ్ఓ పరిశీలన

విశాలాంధ్ర-కొమురాడ: మండలంలో మంగళవారం రాంభద్రపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని డిఎంహెచ్ఓ పరిశీలించారు. ముందుగా పలు రికార్డులను పరిశీలించే తర్వాత సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేశారు. అన్న ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎండలు తీవ్రత ఎక్కువ ఉండడం బట్టి వృద్ధులు చిన్న పిల్లలు గర్భిణీలు ప్రత్యేక దృష్టి పెట్టాలని వైద్య అధికారికి బి.శామ్యూల్ తెలిపారు. డిఎంహెచ్ఓ కి ఘనంగా సన్మానం ఈనెల 30వ తేదీ తోనే మన్యం జిల్లా డీఎంహెచ్వో జగన్నాధరావు పదవి విరమణ చేస్తున్న సందర్భంగా మంగళవారం రామభద్రపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారి సిబ్బంది ఘనంగా సన్మానం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ బాధ్యతలు చేపట్టి నుంచి నేటి వరకు గిరిజన ప్రాంతాల్లో గిరిజనులకు చాలా మంచి వైద్యం అందించేలా కింద అధికారులకు మెప్పించి గిరిజనులకు వైద్యం నిర్లక్ష్యం చేయరాదరే అతను ఎన్నోసార్లు పిహెచ్సి పరిశీలించిన వచ్చినప్పుడు గిరిజనులపట్ల అతనుకున్న అభిమానాన్ని గిరిజనులు చిన్నారులు గర్భిణీలు ప్రత్యేక శ్రద్ధ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కూడా ప్రత్యేకంగా చూసుకుండేవారిని వైద్యాధికారి ఆయన మాటల్లో తెలిపారు ఈ కార్యక్రమంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

ఎర్రజెండా రెపరెపల మధ్య ఇండియా కూటమి అభ్యర్థి మండంగి రమణ నామినేషన్

పూర్వవైభవం తలపించేలా ఎరుపెక్కిన పురవీధులు

విశాలాంధ్ర-కురుపాం : ఇండియా కూటమి అ బలపరిచిన సిపిఎం ఎమ్మెల్యే అభ్యర్థి మండంగి రమణ నామినేషన్ ప్రక్రియ మంగళవారం ఎర్రజెండా రెపరెపలు మధ్య కాంగ్రెస్, సిపిఎం, సిపిఐ నాయకులు కార్యకర్తలతో కోలాహలంగా జరిగింది. ఈ కార్యక్రమానికి 5 మండలాల్లో ఉన్న గిరిజనులు దళితులు కర్షకులు కార్మికులు ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని తమ మద్దతు తెలిపారు. స్థానిక రావాడ కూడలి నుంచి దూళికేశ్వర ఆలయం వరకు సుమారు కిలోమీటర్ పొడవున భారీ ర్యాలీ నిర్వహించారు. డప్పులు కోలాటం మహిళలను నృత్యాలు అందరినీ ఆకట్టుకున్నాయి. పుర వీధులన్నీ ఎర్రజెండా రెపరెపలు ఎరుపెక్కాయి. ఈ ర్యాలీని చూసి ఎర్రజెండా పూర్వవైభవం పక్కా అన్న విధంగా ప్రజల్లో ఉత్సాహభరితంగా సాగింది. అనంతరం ఇండియా కూటమి ఉమ్మడి అభ్యర్థి సిపిఎం బి ఫారం పై ముండంగి రమణ నామినేషన్ పత్రాలను రిటర్నింగ్ అధికారి వివి రమణ కు అందజేశారు. సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు పుణ్యవతి మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంతంలో సమస్యలు పరిష్కారం జరుగేందుకు ఎర్రజెండా పోరాటం తోనే సాధ్యం అని అన్నారు. ఇప్పుడు అనుభవిస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలు నాటి పోరాటం ఫలితంగా నే అని అన్నారు. ఈ ఎన్నికలు లో సిపిఎం పార్టీ తరపున పోటీ చేస్తున్న మండంగి రమణకు ఓటు వేసి ఆశీర్వదించాలని కోరారు. కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి బోను శంకర్రావు, సిపిఐ జిల్లా కార్యదర్శి కూరంగి మన్మథరావు, ఐద్వా మహిళలు పారిశుధ్య కార్మికులు రిక్షా కార్మికులు మోటార్ యూనియన్ కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని మద్దతిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు, సిపిఎం పార్టీ జిల్లా కమిటీ సభ్యులు కోలక అవినాష్, కొల్లి గంగునాయుడు, కురుపాం, జిఎం వలస, కొమరాడ, గరుగుబిల్లి మండలాల కార్యదర్శులు మండంగి శ్రీను, కోరంగి సీతారాం, కోల్లి సాంబమూర్తి, బి.వి.ఆర్, సిపిఎం గిరిజన సంఘం సిపిఐ కాంగ్రెస్ పార్టీలో నాయకులు కార్యకర్తలు మాజీ సర్పంచులు, మాజీ ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

ఎండపల్లిలో మూడు తాటాకు ఇళ్లు దగ్ధం

సుమారు ఐదు లక్షలు ఆస్తి నష్టం

విశాలాంధ్ర-గంగవరం : మండలంలోని ఎండ పల్లి గ్రామంలో సోమవారం రాత్రి సంభవించిన అగ్ని ప్రమాదంలో మూడు తాటాకు ఇల్లు దగ్ధం కాగా సుమారు ఐదు లక్షల రూపాయలు ఆస్తి నష్టం సంభవించింది. ఈ సంఘటనకు సంబంధించి మండల రెవెన్యూ ఇన్స్పెక్టర్ జలానీ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి సోమవారం అర్ధరాత్రి సమయంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా చింతోజీ సత్తిబాబు, చింతాజీ సోమాలమ్మ, చవళం ఎర్రమ్మ గృహాలు అగ్నికి ఆహుతి అయ్యాయన్నారు. మొదటగా చింతోజీ సత్తిబాబు ఇంటి నుండి మంటలు రావడం జరిగిందని ఆ సమయంలో సత్తిబాబు కుటుంబ సభ్యులు ఇంట్లోనే నిద్రిస్తున్నారని స్థానికులు విషయం గ్రహించి వారిని అప్రమత్తం చేయడంతో వారు కట్టు బట్టలతో బయటకు పరుగులు తీశారని ఆయన తెలిపారు. అనంతరం మంటలు మరో రెండు ఇండ్లకు పాకడంతో అవి కూడా పూర్తిగా దగ్ధమయ్యాయి అన్నారు. స్థానిక వీఆర్వో సమాచారంతో తాసిల్దార్ ఆదేశాలతో ఘటన స్థలాన్ని పరిశీలించి తక్షణ సహాయంగా ఒక్కో కుటుంబానికి 25 కేజీల బియ్యం, కేజీ కందిపప్పు, నిత్యవసర వస్తువులు అందించడం జరిగిందన్నారు. అలాగే ప్రభుత్వం నుండి అందాల్సిన సహాయ సహకారాలు అందించడం జరుగుతుందన్నారు. అలాగే బాధిత కుటుంబాలను మండల పరిషత్ అధ్యక్షుడు పల్లాల కృష్ణారెడ్డి, మర్రిపాలెం మాజీ సర్పంచ్ పీరు బాలు రెడ్డి, సచివాలయ కన్వీనర్ చంద్రబాబు పరామర్శించారు.

అరకు వైసీపీలో రెబల్ పోరు

అరకు అసెంబ్లీకి ఆరు నామినేషన్లు దాఖలు



విశాలాంధ్ర-పాడేరు: అరకు అసెంబ్లీ నియోజకవర్గం నుండి మంగళవారం పాడేరు ఐటీడీఏ కార్యాలయంలో ఆరు నామినేషన్లు దాఖలయ్యాయి. అరకు అసెంబ్లీ నియోజకవర్గం రిటర్నింగ్ అధికారి, ఐటిడిఏ ప్రాజెక్టు అధికారు వి.అభిషేక్ అభ్యర్థుల నుండి నామపత్రాలను స్వీకరించారు. స్వతంత్ర అభ్యర్థులుగా చెండా ఎలియా, సివేరి అబ్రహాం, వంతాల రామన్న, నరాజి మధుబాబు, మర్రి ఉషారాణి నామినేషన్లను సమర్పించారు. జై భారత్ నేషనల్ పార్టీ అభ్యర్థిగా బురిడి ఉపేంద్ర నామినేషన్లు దాఖలు చేసారు. స్వతంత్ర అభ్యర్థులుగా నామినేషన్లు దాఖలు చేసిన వారిలో వంతాల రామన్న వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రెబల్ అభ్యర్థిగా ఎన్నికల బరిలో నిలిచారు. దీనితో వైసిపి అభ్యర్థికి రెబల్ పోరు తెప్పేలా లేదని చెప్పవచ్చు.

అడవి పంది దాడిలో ఇద్దరికీ తీవ్ర గాయాలు

విశాలాంధ్ర-అనంతగిరి : అడవి పంది దాడిలో ఇద్దరు వ్యక్తులు తీవ్రంగా గాయపడిన సంఘటన అనంతగిరి మండలంలో మంగళవారం చోటుచేసుకుంది స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం శివలింగపురం గ్రామానికి చెందిన ఏ దేవుడు డి వెంకట్రావు అనే ఇద్దరు పశువుల కాపరులు గ్రామ సమీపంలో గల అట వి ప్రాంతంలో పశువులు మేపుతుండగా అటుగా వచ్చిన అడవి పంది ఒక్కసారిగా వారిపై దాడి చేసింది ఈ దాడిలో ఇద్దరు గాయపడగా వెంకట్రావు తీవ్రంగా గాయపడ్డాడు వీరిని శృంగవరపుకోట ఏరియా ఆసుపత్రికి వైద్యం నిమిత్తం తరలించారు.

ఎండపల్లి అగ్ని ప్రమాద బాధితులకు మెర్సి ఆఫ్ ద ఫ్యూచర్ ఫౌండేషన్ సహాయం

విశాలాంధ్ర-గంగవరం : సోమవారం రాత్రి జరిగిన అగ్ని ప్రమాదంలో నిరాశ్రయులైన బాధిత కుటుంబాలైన చింతోజి సత్తిబాబు, చింతాజి సోమాలమ్మ, చవళం ఎర్రమ్మ కుటుంబాలకు మెరిసి ఆఫ్ ది ఫ్యూచర్ ఫౌండేషన్ 25 కేజీల బియ్యం బ్యాగ్, చీరలు, పిల్లలకు బట్టలు, చెప్పులు పంపిణీ చేసినట్లు ఫౌండేషన్ సభ్యులు హార్టికల్చర్ అసిస్టెంట్లు అనిల్, రాజు తెలిపారు ఇదే విధంగా గంగవరం, అడ్డతీగల, వై రామవరం మండలాలలో కూడా అగ్ని ప్రమాద బాధితుల కుటుంబాలకు సహాయం చేయడం జరిగిందన్నారు.

నాటు సారా తయారీ అక్రమ మద్యం వ్యాపారాలపై కఠిన చర్యలు చేపడతాం

స్పెషల్ ఎన్ఫోర్స్మెంట్ సీఐ రాజు

విశాలాంధ్ర-చింతపల్లి : నాటుసారా తయారీ అక్రమ మద్యం క్రయవిక్రయాలపై స్పెషల్ ఎన్ఫోర్స్మెంట్ బ్యూరో కఠినంగా వ్యవహరిస్తుందని స్పెషల్ ఎన్ఫోర్స్మెంట్ బ్యూరో సర్కిల్ ఇన్స్పెక్టర్ వై రాజు అన్నారు. స్థానిక స్పెషల్ ఎన్ఫోర్స్మెంట్ కార్యాలయంలో మంగళవారం ఆయన మాట్లాడుతూ గడచిన నాలుగు నెలలలో చింతపల్లి సర్కిల్ పరిధిలో 146 కేసులు నమోదు చేసి 55 మందిని అరెస్టు చేయడంతో పాటు 565 లీటర్ల సారాయి, సారాయి తయారీకి ఉపయోగించే 68,300 లీటర్ల బెల్లపు ఓటను ధ్వంసం చేయడం జరిగిందన్నారు. ఇదే క్రమంలో 141 లీటర్ల మద్యాన్ని స్వాధీనం చేసుకున్నామని, ప్రస్తుతం సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో తమ శాఖ మరింత పటిష్టంగా దాడులు నిర్వహించి నాటు సారా తయారీ, అక్రమ మద్యం క్రయవిక్రయాలపై కఠినంగా వ్యవహరిస్తుందని ఈ సందర్భంగా స్పెషల్ ఎన్ఫోర్స్మెంట్ సర్కిల్ ఇన్స్పెక్టర్ వై.రాజు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

విశాలాంధ్ర
తెలుగు జాతీయ దినపత్రిక
విలేకరులు కావలెను
విశాలాంధ్ర దినపత్రికకు
అల్లూరి సీతారామరాజు జిల్లాలో ఈ క్రింది తెలుపబడిన మండలాలకు విలేకరులు కావలెను. విశాలాంధ్రలో
అంకితభావంగా పనిచేయాలన్న ఆసక్తి గల వారికి అవకాశం కల్పించబడును.
కావాల్సిన ప్రాంతాలు :
డుంబ్రిగుడ, కొయ్యూరు
సంప్రదించవలసిన నెం : యర్రయ్యరెడ్డి
7989138129, 7386603589

మండల టాపర్‌కు సర్పంచ్ ఘన సన్మానం

విశాలాంధ్ర-పాచిపెంట : పదివ తరగతి పరీక్షల్లో మండల టాపర్‌గా నిలిచిన కొత్తవలస గ్రామానికి చెందిన మతల తేజాకు కొటికిపెంట పంచాయతీ సర్పంచ్ ఇజ్జాడ అప్పలనాయుడు మంగళవారం ఉదయం ఘనంగా సన్మా నించారు. పాచిపెంట మండలంలో కొత్తవలస జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో చదువుకున్న తేజ 600కు 558 మార్కులు సంపాదించారని మండలంలో కొటికిపెంట పంచాయతీ గొప్పతనాన్ని చాటి చెప్పారన్నారు. ఆ విద్యార్థి భవిష్యత్తులో ఉన్నత చదువులు చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని కోరారు. రైతు కుటుంబంలో పుట్టిన తేజ చదువుపై శ్రద్ధ చూపి ప్రభుత్వ పాఠశాలలో చదివి మంచి మార్కులతో బ్రతుకు కనపరచడం పంచాయతీకి గర్వకారణం అని అన్నారు. స్కూలు ప్రధానోపాధ్యాయులు నిర్మలమ్మకు అభినందనలు తెలిపారు. పాఠశాల ఉపాధ్యాయులను అభినందించారు. వచ్చే ఏడాది మరింత మంచి పేరు తెచ్చి పెట్టాలని విద్యార్థులను కోరారు. కొత్తవలస జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లో 19 మంది విద్యార్థులు పరీక్షలు రాయిగా అందులో 17 మంది విద్యార్థులు పాసయ్యారని తెలిపారు. 15 మంది ప్రథమ స్థానంలో నిలవగా ఒకరు ఆర్డినరీగా పాస్ అయ్యారని ఇద్దరూ ఫైల్ అయ్యారని ప్రధానోపాధ్యాయులు తెలిపారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు తన సహాయ సహకారాలు ఉంటాయని అన్నారు.

సీతంపేట ఐటీడీఏ నూతన పీఓగా ఎస్.హెచ్. శుభమ్ బన్సాల్

విశాలాంధ్ర-పార్వతీపురం... మన్యం జిల్లాలోని సీతంపేట ఐటిడిఏ నూతన పిఓగా ఐఏఎస్ అధికారి ఎస్‌హెచ్ శుభం బన్సాల్‌ను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వ కార్యదర్శి జవహార్ రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. ఇంతవరకు ఇక్కడ ప్రాజెక్ట్ అధికారిగా పనిచేసిన కల్పనాకుమారికి ఆకస్మికంగా బదిలీ చేస్తూ, ఆమెకు జనరల్ అడ్మినిస్ట్రేషన్ డిపార్ట్మెంట్ లో రిపోర్టు చేయాలని ఉత్తర్వులో పేర్కొన్నారు. ఆమె మంగళవారం రిలీవ్ అయిన సంగతి తెలిసిందే. కొత్తగా నియమించబడిన పిఓ బన్సాల్ నేడు బాధ్యతలు స్వీకరిస్తారని అధికార వర్గాలు తెలిపాయి.

తెలుగుదేశంపార్టీలో చేరిన ఏగోటివలస గ్రామస్తులు

విశాలాంధ్ర-సీతానగరం : మండలంలోని ఏగోటివలస గ్రామానికి చెందిన పలు కుటుంబాలు టీడీపీలో చేరినట్లు టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి బోనెల విజయ్ చంద్ర తెలిపారు. వైయస్సార్ పార్టీ విడిచిపెట్టి తెలుగుదేశం పార్టీలో చేరారు. ఈకార్యక్రమంలో టిడిపి,జనసేన, బిజెపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

విశాలాంధ్ర
పేజీ : 2
అల్లూరి సీతారామరాజు
పార్వతీపురం మన్యం
బుధవారం 24, ఏప్రిల్ 2024

డిఎంహెచ్ఓకు సత్కారం

విశాలాంధ్ర-బెలగాం : పార్వతీపురం మన్యం జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి (డిఎంహెచ్ఓ) డాక్టర్ బగాది జగన్నాధరావును రావాడ రామభద్రపురం పిహెచ్సి వైద్యాధికారులు, వైద్య సిబ్బంది ఘనంగా సత్కరించారు. జిల్లాలో వైద్య సేవలు విస్తృతంగా అందజేయడంలో ఎంతో కృషి చేసి, జిల్లా ఆరోగ్య శాఖను ప్రగతి పథంలో నడిపిస్తూ వైద్య సిబ్బందికి మార్గ నిర్దేశం చేస్తూ అందరికీ స్ఫూర్తిదాయకమయ్యారని కొనియాడారు.

పదవ తరగతి ఫలితాల్లో విద్యార్థుల ప్రతిభ

విశాలాంధ్ర-సీతానగరం : స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఇల్లా ప్రసన్నలక్ష్మి- ఇట్లామామిడిపల్లి గణితం స్కూల్ అసిస్టెంట్ పల్లికల వరప్రసాదరావుల రెండోకుమార్తె పల్లికల లక్ష్మిఅభిజాత్య సోమవారం రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన పదోతరగతి పరీక్షల ఫలితాల్లో 595 మార్కులు సాధించి రాష్ట్రస్థాయిలో 5వ ర్యాంకును సాధించారు. లక్ష్మిఅభిజాత్య మొదటి మూడుభాషలలో 296/300 మార్కులను,గణితం, సైన్స్, సోషల్ సబ్జెక్టులలో 299/300 మార్కులు సాధించారు. ఇప్పటికే వారి మొదటిఅమ్మాయి నీట్‌లో గతఏడాది మంచిర్యాంకును సాధించి భువనేశ్వర్ లోగల ఎయిమ్స్ లో మొదటి సంవత్సరం మెడికల్ చదువుతుంది. ప్రస్తుతం పదోతరగతి పరీక్షలలో 595 మార్కులు సాధించిన రెండో అమ్మాయి లక్ష్మిఅభిజాత్య ఎంపీసీ గ్రూపులో జాయిన్ అవుతున్నట్లు చెప్పారు. ఐఐటి సాధన తన లక్ష్యమన్నారు. తామిద్దరమ్మాయిలం ఉత్తమ ఫలితాలు సాధించేందుకు తల్లిదండ్రుల సహకారం,ఉపాధ్యాయుల మరువలేనిదని తెలిపారు. ఉన్నత స్థానాలకు చేరుకునేందుకు అహర్నిశలు కష్టపడి చదువుతున్నట్లు తెలిపారు.

బెలగాం : పార్వతీపురం మన్యం జిల్లా గుమ్మలక్ష్మీపురం మండలం భద్రగిరి ఐటిడిఏ పరిధిలో ఉన్న గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికల పాఠశాలలో చదువుతున్న అద్దాకుల బిందుమతి 10వ తరగతిలో 567 మార్కులు సాధించి అన్ని గిరిజన ఆశ్రమ పాఠశాలలో కన్నా ఉత్తీర్ణత విద్యార్థిని ప్రథమ స్థానంలో నిలిచింది. తాడికొండ గిరిజన గ్రామానికి చెందిన విద్యార్థిని బిందుమతిని గిరిజన సంక్షేమ సహాయ అధికారి, ఆ పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది, తదితరులు అభినందించారు.

చింతపల్లి : రాష్ట్రవ్యాప్తంగా విడుదలైన పదవ తరగతి పరీక్షా ఫలితాలలో మండల కేంద్రంలోని రామాలయం వీధిలో నిరుపేద కుటుంబానికి చెందిన అంజూరి జోత్స్న 512 మార్కులతో ఉత్తమ ప్రతిభ చాటింది. స్థానిక జిల్లా పరిషత్ ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న ఆ విద్యార్థిని ఈ ఏడాది పదవ తరగతి పరీక్ష ఫలితాల్లో పాఠశాల టాపర్గా నిలిచింది. మండల కేంద్రానికి చెందిన అంజూరి శ్రీనివాసరావు(లేటు), తల్లి వరలక్ష్మి దంపతుల ఇద్దరు కుమార్తెలలో జ్యోత్స్న మొదటి కుమార్తె, కాగా జ్యోత్స్న తండ్రి శ్రీనివాసరావు పాత ఇనుప సామాన్లు(స్క్రాప్) క్రయ విక్రయాలు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించేవాడు. దురదృష్టవశాత్తు క్యాన్సర్ వ్యాధితో గత ఆరు నెలల క్రితం ఆయన మరణించాడు. దీంతో కుటుంబ పోషణ భారం వరలక్ష్మి పై పడింది. కుటుంబ పోషణకై తల్లి వరలక్ష్మి టిఫిన్ సెంటర్ నడుపుతూ పిల్లలిద్దరిని చదివిస్తుంది. తల్లి నడుపుతున్న టిఫిన్ దుకాణంలో సహాయకారిగా ఉంటూనే జోత్స్న పదవ తరగతి పరీక్షలు రాసింది. శ్రీనివాసరావు మరణంతో ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొన్న ఆ కుటుంబానికి టిఫిన్ దుకాణమే జీవనాధారమయ్యింది. వైద్య విద్యను అభ్యసించాలన్న తన లక్ష్యానికి తండ్రి మరణంతో ఆర్థిక పరిస్థితులు అనుకూలంగా లేవని జోత్స్న వాపోయింది. తన ప్రతిభను గుర్తించి ప్రభుత్వం, దాతలు సహకరిస్తే అనుకున్న లక్ష్యాన్ని సాధించగలనని ఈ సందర్భంగా ఆ విద్యార్థిని తెలిపింది.

బెలగాం: సోమవారం విడుదలైన ఎపి ఎస్.ఎస్.సి 2024 ఫలితాలలో శ్రీచైతన్య స్టేట్ టాప్ మార్క్ 600కి 598 మార్కులతో ముగ్గురు, స్టేట్ సెకెండ్ టాప్ మార్క్ 597 మార్కు ఆపైన 9 మంది శ్రీచైతన్య విద్యార్థులే. స్టేట్ టాప్ మార్క్ 598 మార్కులతో ముగ్గురు, 597 మార్కులు ఆపైన 9 మంది, 596 మార్కులు ఆపైన 24 మంది, 595 మార్కులు ఆపైన 55 మంది, 594 మార్కులు ఆపైన 123 మంది, 590 మార్కులు ఆపైన 524 మంది, 580 మార్కులు ఆపైన 2,321 మంది విద్యార్థులు సాధించారు. సబ్జెక్టులు వారీగా 100కి 100 మార్కులు సాధించిన శ్రీచైతన్య విద్యార్థులు 7,394 మంది. సుమారు 132 బ్రాంచీలకు పైగా 100కి 100 శాతం ఉత్తీర్ణత పొందారు. పార్వతీపురం బ్రాంచి నుండి 586 మార్కులు సాధించడం జరిగింది. మరియు 27 మందికి 550 మార్కులకి పైగా రావడం జరిగింది. విద్యార్థులందరూ 100% పాస్ ఉత్తీర్ణత సాధించడం నిజంగా గర్వకారణం. విజయనగరం శ్రీ చైతన్య బ్రాంచ్ కి 596, 594. అలాగే పార్వతీపురం శ్రీ చైతన్య స్కూల్ లో 586 మార్కులు సాధించడం జరిగింది. అదే విదంగా ఈ బ్రాంచ్ నుండి ,63 మంది రాయగా అందులో 500పైగా వచ్చినవాళ్లు 52 మరియు 550 పైగా వచ్చినవాళ్లు 27ఉన్నారు. ఎజిఎం సురేష్, ఆర్ఐ శ్రీనివాస్ వారిని అభినందించారు.

వి.ఆర్.పురం : అల్లూరి సీతారామరాజు జిల్లా మండల కేంద్రం లోని జడ్పీ హైస్కూలు నందు పదవ తరగతి ఫలితాలలో ప్రభుత్వ పాఠశాలలో చదువుతూ రాజుపేట కాలనీకి చెందిన, జొన్నాడ సుష్మలత 538 మార్కులతో ద్వితీయ స్థానంలో వచ్చినందుకు సుష్మలత తండ్రి నాగేశ్వరరావు పోచమ్మ ఎంతో ఆనందాన్ని వ్యక్తపరిచారు. వీరు వ్యవసాయ కూలి చేసుకుంటూ వాటితో

పాటుగా టెంట్ హౌస్ నడిపించుకుంటూ జీవనం సాగిస్తున్నారు. నాగేశ్వరరావు ఎక్కువగా చదువుకోలేదని వారి ఆర్థిక పరిస్థితి అంతగా అనుకూలించక చదువు ఆపవలసి వచ్చింది అని చెప్పారు, అతను పిల్లలను ఉన్నత చదువులు చదివించాలని అనుకునేవాడు అతని కోరిక మేరకు సుష్మలత చిన్నప్పటినుంచి చదువులో ఎక్కువగా మక్కువ చూపుతూ ఉత్సాహంగా ఉండేది ఆమెను పదో తరగతి చదువుతుండగా గైడెన్స్ ఇస్తూ ప్రోత్సాహంగా తన వెన్నంటుతూ చదివించాడు అనుకున్న విధంగా పదో తరగతి పరీక్షల్లో 538 మార్కులు రావడం ఆయన ఎంతో సంతోషపడ్డాడు అతను కలను కూతురు రూపంలో నెరవేర్చుకున్నాడు, ఉన్నత చదువులు చదివించి గొప్ప ఉద్యోగం సాధించి ఆదర్శంగా ఉండాలని కూతురికి వాళ్ల కుటుంబీకుల తెలియజేసి వారి సమక్షంలో కేక్ కట్ చేసి తినిపించారు. సలహాలు సూచనలు ఇస్తూ మా అమ్మాయిని మంచి మార్కులు వచ్చే విధంగా చదివించిన ఉపాధ్యాయులకు ప్రధానోపాధ్యాయులకు, సుష్మలత తల్లిదండ్రులు ధన్యవాదాలు తెలియజేశారు.

రంప టీడీపీలో రాజేశ్వరితో కుదిరిన రాజీ

విశాలాంధ్ర-రంపచోడవరం : రంపచోడవరం నియోజకవర్గం లో టిడిపి టికెట్ విషయం లో టిడిపి అధిష్టానం ఏకపక్షంగా తీసుకున్న నిర్ణయం తో పార్టీలో ఏర్పడిన విభేదాలను అదినాయకత్వం చక్కదిద్దుదు కార్యక్రమానికి ఎట్టకేలకు శ్రీకారం చుట్టింది. మాజీ ఎమ్మెల్యే వంతల రాజేశ్వరి ప్రతిపక్ష పార్టీ లో టిడిపి లో వరదలు సమయంలో అయితే నేమి పోలవరం నిర్వాసితుల సమస్యల్లో అయితేనేమి పార్టీ ని ప్రజలకుచేరువ చేస్తూ చేసిన సేవకు గుర్తింపు లేకుండా టికెట్ విషయంలో పార్టీ క్యాడర్ కార్యకర్తలకు ఆమోదయోగ్యం కాకుండా అధిష్టానం తీసుకున్న నిర్ణయంతో అధిష్టానంతో గరంగరంగా పార్టీలో ఒక వర్గం రాజేశ్వరికి భరోసా నిలిచిన తరుణం లో పార్టీ సింబల్‌తోనే రెబల్ అభ్యర్థిగా బరిలో దిగుతా నన్నా వంతలను అధిష్టానం ఎట్టకేలకు బుజ్జగించింది. నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ పరిశీలకులు చెల్లుబోయిన శ్రీనివాసరావు అధ్యక్షతన సోమవారం జరిగిన విలీన మండలాల ముఖ్య నాయకులుతో ఏర్పాటు చేసిన సమావేశానికి మాజీ ఎమ్మెల్యే వంతల రాజేశ్వరి కూటమి అభ్యర్థి మిరియాల శిరీష దేవి చింతూరు మండల తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు మాజీ మండల అధ్యక్షులు ఎం.డి జహంగీర్ ఎటపాక మండల అధ్యక్షులు పొట్టి రమేష్ మూవా శ్రీను వల్లభనేని చందు నియోజకవర్గం ముఖ్య నాయకులతో నిర్వాహించిన సమావేశంలో రాజీ కుదిరింది. రంపచోడవరం నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ గెలుపును అందరూ కలిసికట్టుగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. అయితే అసంతృప్తి నేతలను వరసగా బుజ్జగించుకుంటూ వస్తున్న అధినేత చంద్రబాబు నాయుడు పార్టీ అధికారంలోకి వస్తే సముచిత స్థానం ఇచ్చేలా అధిష్టానం నుంచి వచ్చిన హామీ తో రాజీ కి వచ్చినట్టు సమాచారం. దీంతో శిరీషా కు విలీన మండలాలలో టిడిపి నాయకులు కార్యకర్తలు నుంచి కొంత భరోసా అయితే వచ్చిందని చెప్పొచ్చు. ఏది ఏమైనా రంప నియోజకవర్గం లో టిడిపి పార్టీ అధిష్టానం నిర్ణయం ప్రత్యర్థి వైసీపీ అభ్యర్థి ప్రకటనతోనే గెలుపు పై ధీమాను పెంచాయని చెప్పొచ్చు.

అభివృద్ధి సంక్షేమం కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యం

నామినేషన్ దాఖలు చేసిన కాంగ్రెస్ అభ్యర్థి బత్తిన మోహన్రావు

విశాలాంధ్ర-బెలగాం : రాష్ట్రం నియోజకవర్గం పూర్తిస్థాయిలో అభివృద్ధి జరగాలంటే ఒక్క కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని ఆ పార్టీ పార్వతీపురం నియోజవర్గం ఎమ్మెల్యే అభ్యర్థి బత్తిన మోహన్రావు అన్నారు. మంగళవారం ఆయన ఎమ్మెల్యే అభ్యర్థిగా స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో నామినేషన్ దాఖలు చేశారు. ముందుగా పార్వతీపురం పాత బస్టాండ్ నుండి మెయిన్ రోడ్డు మీదుగా భారీ ర్యాలీగా ఆర్డీవో కార్యాలయం వరకు చేరుకున్నారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ స్వర్గీయ వైయస్ రాజశేఖర్ రెడ్డి ఆశీస్సులతో ఆయన కుమార్తె వైఎస్ షర్మిల కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులుగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారని, ఆమె ఆదేశాల మేరకు నేను ఎమ్మెల్యేగా పోటీ చేస్తున్నానని, ప్రజలంతా నన్ను ఆశీర్వదించి గెలిపించాలని కోరారు. ప్రస్తుత రాజకీయ పరిస్థితులు ప్రజలంతా గమనిస్తున్నారని, వైసిపి, టిడిపి, బిజెపి పార్టీలు స్వార్థ రాజకీయాలకు, కుట్ర రాజకీయాలకు ఆజ్యం పోస్తున్నాయన్నారు. ఇటువంటి రాజకీయాలకు ప్రజలు స్వస్తిపలికి ప్రజల మేలుకోరే కాంగ్రెస్ పార్టీని గెలిపించాలని కోరారు. రాష్ట్రంలో పాలన మారాలి, మార్పు కావాలి అంటే కాంగ్రెస్ ప్రభుత్వం రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు చౌక్కాపు వెంకటరమణ, తీళ్ళ గౌరీ శంకర్, పి. రవికుమార్, జె. ప్రవీణ్ కుమార్, సిపిఎం నాయకులు రెడ్డి శ్రీదేవి, బి. సూరిబాబు, ఎస్. ఉమామహేశ్వరరావు, సిపిఐ నాయకులు ఆర్.వి.ఎస్ కుమార్, టి. జీవన్న, జి. సూరయ్య, సిపిఎం, సిపిఐ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

గ్రామ వాలంటీర్లు రాజీనామా

విశాలాంధ్ర-కొమరాడ : గ్రామ వాలం రాజీనామా మండలంలో 20 గ్రామ సచివాలయం పరిధిలో 318 మంది గ్రామ వాలంటీర్లు పనిచేస్తున్నప్పటికీ సోమవారం సాయంత్రం 101 గ్రామ వాలంటరీలో రాజీనామా చేసినట్లుగా ఎంపీడీవో ఎం మల్లికార్జునరావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్చి 16 నుండి ఎన్నికల నియమావళి అమల్లోకి వచ్చినప్పుడు నుండి గ్రామ వాలంటరీలో ఎక్కడ కూడా కనిపించకూడదని రాష్ట్ర ఎలక్షన్ కమిషనర్ ఆదేశాల కలెక్టర్ ఉన్నంత అధికారులు ఆదేశాలు ఎవరైనా నిర్లక్ష్యంగా ఎవరిస్తే అంతటివారికైనా చర్యలు తప్పవని ఆయన అన్నారు.

కాంగ్రెస్ ఎంఎల్ఏ అభ్యర్థిగా బత్తిన నామినేషన్ దాఖలు

విశాలాంధ్ర-పార్వతీపురం: పార్వతీపురం శాసనసభ నియోజకవర్గం నుంచి ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా బత్తిన మోహనరావు మంగళవారం ఒక సెట్ నామినేషన్ పత్రాలను పార్వతీపురం రిటర్నింగ్ అధికారి కె హేమలతకు అందజేసారు. పార్వతీపురం పాత బస్టాండ్ నుంచి మెయిన్‌రోడ్డు మీదుగా భారీ ర్యాలీగా ఆర్డీవో కార్యాలయం వరకు చేరుకొని నామినేషన్ వేశారు. ఈకార్యక్రమంలో చొక్కాపు వెంకటరమణ, తీళ్ళ గౌరీశంకర్, పి. రవికుమార్, జే.ప్రవీణ్ కుమార్, సిపిఎం నాయకులు రెడ్డిశ్రీదేవి, బి సూరిబాబు, ఎస్. ఉమామహేశ్వరరావు, సిపిఐ నాయకులు ఆర్ వి ఎస్ కుమార్, టి.జీవన్న, జి.సూరయ్య తదితరులు పాల్గొన్నారు. ఇదిలాఉండగా స్వతంత్ర అభ్యర్థిగా గర్భాపు మోహన రావు కూడా విచ్చేసి ఒక సెట్ నామినేషన్ పత్రాలను రిటర్నింగ్

అరకు ఎంపీగా కూటమి అభ్యర్థి కొత్తపల్లి గీతని గెలిపించండి: కొత్తపల్లి విజయ్

విశాలాంధ్ర-పార్వతీపురం : అరకు పార్లమెంటు బీజేపి, టీడీపి, జనసేన కూటమి అభ్యర్థి కొత్తపల్లి గీతను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కొత్తపల్లి గీత తనయుడు కొత్తపల్లి విజయ్ మంగళవారం అరకు పార్లమెంటు కార్యాలయంలో ఆయనవిలేకరులతో మాట్లాడారు.అరకు పార్లమెంటు పరిదిలోగల కూటమి ఎమ్మెల్యే అభ్యర్థులైన అరకు-పాంగిరాజారావు పాడేరు - గిడ్డిఈశ్వరి, రంపచోడవరం-మిరియాల శిరీష, సాలూరు - గుమ్మడి సంధ్య రాణి, కురుపాం-తోయక జగదీశ్వరి, పార్వతీపురం-బోనెల విజయ్ చంద్ర, పాలకొండ-నిమ్మక జయకృష్ణలను కూడా గెలిపించాలని కోరారు. కేంద్రంలో బిజెపి ప్రభుత్వం గత పదేళ్లుగా పెద్దఎత్తున అభివృద్ధి పనులు చేపట్టిందని, దీన్ని చూసి ఓటు వేయాలని ఆయన కోరారు ఆయనతో పాటు మాజీఎమ్మెల్సీ ద్వారపురెడ్డి జగదీష్, జనసేన నియోజకవర్గ ఇంచార్జిఆడారు మోహనరావు, బిజెపినేత సురగాల ఉమా మహేశ్వర రావులు పాల్గొన్నారు.

విశ్వేశ్వర రాజు విజయమే లక్ష్యం : ఎంపీపీ అనూష దేవి

విశాలాంధ్ర-చింతపల్లి : వైకాపా పాడేరు నియోజకవర్గ అభ్యర్థి మత్స్యరాస విశ్వేశ్వర రాజు విజయమే తమ లక్ష్యమని ఎంపీపీ కోరాబు అనూష దేవి అన్నారు మండలంలోని లోతుగెడ్డ జంక్షన్ వారపు సంతలో మంగళవారం వైస్సార్సీపీ ప్రసార కార్యక్రమంలో ఆమె పాల్గొని వైకాపా అభ్యర్థి విశ్వేశ్వర రాజు విజయానికై పార్టీ శ్రేణులతో కలిసి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో వైకాపాను అధికారంలోకి తీసుకు రావడమే లక్ష్యంగా పార్టీ శ్రేణులు పనిచేయాలన్నారు. పాడేరు శాసనసభ అరకు పార్లమెంట్ స్థానాలలో వైకాపా తరపున పోటీ చేస్తున్న మత్స్యరాస విశ్వేశ్వర రాజు గుమ్మ తనుజారాణి ల విజయానికై కృషి చేయాలని పార్టీ శ్రేణులకు ఆమె పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా పార్టీ ప్రజా ప్రతినిధులు, పార్టీ శ్రేణులతో కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ మండల అధ్యక్షుడు మోరి రవి, వైస్ ఎంపీపీలు, మాజీ ఎంపీపీ, మాజీ వైస్ ఎంపీపీ, మండల సర్పంచ్ లు, ఎంపీటీసీలు, మాజీ ఎంపీటీసీలు, మాజీ సర్పంచ్ లు, మరియు మండల వైస్సార్సీపీ పార్టీ కన్వీనర్లు, ముఖ్య నాయకులు, కార్యకర్తలు, అభిమానులు,పాల్గొని జన సమూహంతో పెద్ద ఎత్తున ప్రసార కార్యక్రమం నిర్వహించారు.

బూత్ లెవల్, రూట్ అధికారులకు అవగాహన

విశాలాంధ్ర.-వి. ఆర్. పురం. : అల్లూరి సీతారామరాజు జిల్లా రంపచోడవరం జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మంగళవారం ఎమ్మార్వో సయ్యద్ మౌలానా పజిల్ బూత్ లెవెల్ రూట్ ఆఫీసర్లతో అవగాహన కార్యక్రమం నిర్వహించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలింగ్ స్టేషన్లో పోలింగ్ సక్రమంగా నిర్వహించేందుకు పోలింగ్ స్టేషన్లో కావలసిన సదుపాయాలను ముందుగానే తెలుసుకొని ఏ లోపం లేకుండా జాగ్రత్త తీసుకోవాలని బూత్ లెవెల్ ఆఫీసర్లకు తెలియజేశారు, పోలింగ్ సెంటర్లో ఓటర్స్ ఓటు నమోదు చేసేటప్పుడు ఓటర్ ఐడి సరిచూసి పంపించవలెను, బ్యాలెట్ బూత్ బూతుల దగ్గర బయట నుండి అర్హత లేని వారిని రాణించకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలి, ఓటింగ్ నమోదు జరిగేటప్పుడు పోలింగ్ జరిగేటప్పుడు గంటకు ఎంత శాతం ఓటింగ్ నమోదు అయినదని తెలియపరచవలెను, సిగ్నల్ లేని ఏరియాల్లో రన్నర్స్ ద్వారా పోలింగ్ శాతం ఎంత నమోదు జరిగిందన్నది తెలియపరచవలసిందిగా తెలియజేశారు ఈ కార్యక్రమంలో బిఎల్వోస్ రూట్ ఆఫీసర్స్ తదితరులు పాల్గొన్నారు.

మన్య ప్రాంతానికి మంచి జరగాలంటే పోరాడే వామపక్ష అభ్యర్థులు ప్రజా ప్రతినిధులవ్వాలి

అరకు పార్లమెంట్ సిపిఎం అభ్యర్థి అప్పలనర్సకు పెరుగుతున్న జనాదరణ

సిపిఎం పార్టీ మండల ప్రధాన కార్యదర్శి ధనుంజయ్

విశాలాంధ్ర-చింతపల్లి : మన్య ప్రాంతానికి మంచి జరగాలంటే పోరాడే వామపక్ష అభ్యర్థులు ప్రజా ప్రతినిధులవ్వాలని సిపిఎం పార్టీ చింతపల్లి మండల ప్రధాన కార్యదర్శి పాంగి ధనుంజయ్ అన్నారు. మండలంలోని కొత్తపాలెం, బెన్నవరం పంచాయతీలలోని దేగలపాలెం, పిన్నపాడు గ్రామాల్లో ఆ పార్టీ అరకు పార్లమెంట్ అభ్యర్థి పాచిపెంట అప్పలనర్స ను గెలిపించాలని సీపీఎం పార్టీ మండల కమిటీ సభ్యుడు సీదరి సత్తిబాబు ఆధ్వర్యంలో మంగళవారం ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ధనుంజయ్ మాట్లాడుతూ దేశంలో, రాష్ట్రంలో ఇప్పటివరకు అరాచక పాలన కొన సాగిందని ముఖ్యంగా గిరిజన ప్రాంత చట్టాలు, హక్కుల్ని తొలగించటానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కుట్రలు పన్నుతున్నాయని, ఇది చాలా ప్రమాదకరమైన చర్య అన్నారు. ప్రచారం చేస్తున్న ప్రతి గ్రామంలో గిరిజనులు, నిరుద్యోగ యువత స్పందిస్తున్నారని నిత్యం ప్రజలతో మమేకమై సమస్యలపై పోరాడుతున్న సిపిఎం పార్టీ అభ్యర్థులు గెలిస్తేనే మన్య ప్రాంత సమస్యలు పరిష్కారం కాగలవని ప్రతి ఒక్కరూ నమ్ముతున్నారన్నారు. మిగతా పార్టీల ప్రజాప్రతినిధులు వారి స్వప్రయోజనాల కోసం మాత్రమే ఉంటున్నారు తప్ప గిరిజన ప్రజా సమస్యలపై చట్టసభల్లో మాట్లాడటం లేదని, ఈ విషయంలో గిరిజన ప్రజల నుండి మంచి స్పందన వస్తుందన్నారు. గిరిజన నిరుద్యోగ యువతకు ఉద్యోగ రిజర్వేషన్ కోసం ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదని చట్టాల అమలుకు కనీసం చొరవ తీసుకోవడం లేదని ఇప్పటి వరకు గెలిచిన గిరిజన ప్రజా ప్రతినిధులంతా సంపాదనలకు తప్ప ఓటు వేసిన ప్రజల సమస్యలు పట్టించుకోవడం లేదని, చట్టసభల్లో మాట్లాడడం లేదని అభిప్రాయం వ్యక్తం చేశారు. 2024 సార్వత్రిక ఎన్నికల్లో ప్రజల కోసం పనిచేసే సిపిఎం పార్టీ అభ్యర్థి ప్రజా నాయకుడు కామ్రేడ్ పాచిపెంట అప్పలనర్సను అత్యధిక మెజారిటీతో గెలిపించి మన్య ప్రాంత సమస్యల పరిష్కారానికి గిరిజన యువత, విద్యావంతులు, మేధావులంతా మద్దతు ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. ఎంపీ అభ్యర్థి గుర్తు సుత్తి కొడవలి నక్షత్రం పై ఓటు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించవలసిందిగా ప్రజానీకానికి ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ నాయకులు సీదరి సత్తిబాబు, మహిళా సంఘం జిల్లా నాయకులు పాంగి కుమారి, చిన్నమ్మి ,శ్రీను ,వెంకట్రావు, చిట్టిబాబు ప్రజలు మహిళలు నిరుద్యోగ యువత పాల్గొన్నారు.

రెండవ సెట్ నామినేషన్ దాఖలు చేసిన అభ్యర్థులు

విశాలాంధ్ర-కురుపాం : తెలుగు దేశం, బిజెపి,జనసేన ఉమ్మడి అభ్యర్థి తోయక జగదీశ్వరి, స్వతంత్ర అభ్యర్థి నిమ్మక జయరాజు లు మంగళవారం తమ రెండవ సెట్ నామినేషన్ పత్రాలను రిటర్నింగ్ అధికారి వి.వెంకటరమణకు అందజేశారు. తెలుగుదేశం పార్టీ నాయకులు పొన్నూరు వెంకట నాయుడు, కోలా రంజిత్ కుమార్,వెంపటాపు భారతి,పోలూరు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నామినేషన్ కార్యక్రమానికి పెద్దఎత్తున తరలిరండి

వైసీపీ ఎమ్మెల్యేఅభ్యర్థి జోగారావు

విశాలాంధ్ర-సీతానగరం : పార్వతీపురం ఆర్డీవో కార్యాలయంలో పార్వతీపురం శాసనసభ నియోజకవర్గ వైఎస్ఆర్సిపి అభ్యర్థిగా నేడు నామినేషన్ వేస్తున్నందున వైఎస్ఆర్సిపి ప్రజాప్రతినిదులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, శ్రేయోభిలాషులు పెద్ద ఎత్తున తరలిరావాలని ఎమ్మెల్యే అభ్యర్థి అలజింగి.జోగారావు కోరారు. పాత బస్ స్టాండ్ నుండి భారీ ర్యాలీతోవెళ్లి నామినేషన్ పత్రాలను రిటర్నింగ్ అధికారికి ఉదయం నిర్దేశించిన సమయానికి దాఖలు చేస్తానని చెప్పారు.

అరకు పార్లమెంటుకు ఇద్దరు అభ్యర్థులు నామినేషన్లు దాఖలు

విశాలాంధ్ర-పార్వతీపురం : అరకు పార్లమెంటు నియోజకవర్గ ఎంపీ అభ్యర్థులుగా స్వతంత్ర అభ్యర్థిగా జైభారత్ పార్టీ అభ్యర్థి బిడ్నాయన చంటిబాబు ఒక సెట్ నామినేషన్ దాఖలు చేశారు. మంగళవారం జిల్లా ఎన్నికల అధికారయిన జిల్లా కలెక్టర్ నిషాంత్ కుమార్ కు అందజేసారు. తెలుగు రాజాధికార సమితి పార్టీఅభ్యర్థి (టిఆర్ఎస్)గా జల్లి రాంబాబు ఎంపీ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేశారు.

25న నామినేషన్ కార్యక్రమానికి పెద్దఎత్తున తరలిరండి

టీడీపి ఉమ్మడి పార్టీల అభ్యర్థి విజయ్ చంద్ర

విశాలాంధ్ర-పార్వతీపురం : పార్వతీపురం నియోజకవర్గ ఎన్డీఏ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థిగా తాను ఈనెల 25న నామినేషన్ వేస్తానని, ఈకార్యక్రమానికి టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు కార్యకర్తలు అభిమానులు శ్రేయోభిలాషులు పెద్ద ఎత్తున తరలి వచ్చి పాల్గొని విజయవంతం చేయాలని టీడీపీ ఉమ్మడి పార్టీల అభ్యర్థి బోనెల విజయచంద్ర పిలుపునిచ్చారు.మీలో ఒకడినని, మీతోనేఉంటానని, నన్ను ఆశీర్వదించడానికి మీరంతా తరలిరావాలని నియోజకవర్గ ప్రజలకు ఆయన విజ్ఞప్తి చేశారు.ఈకార్యక్రమంలో టీడీపీ, బిజెపి, జనసేననాయకులు పాల్గొన్నారు.

గిడ్డి ఈశ్వరి నామినేషన్‌లో పసుపుమయమైన పాడేరు

తెదేపా మండల అధ్యక్ష ఉపాధ్యక్షులు పూర్ణచంద్రరావు, లక్ష్మణ్

విశాలాంధ్ర-చింతపల్లి : తెలుగుదేశం పార్టీ పాడేరు నియోజకవర్గ అభ్యర్థి గిడ్డి ఈశ్వరి నామినేషన్ కార్యక్రమంతో అల్లూరి జిల్లా పాడేరు పసుపు మయమైందని ఆ పార్టీ చింతపల్లి మండల అధ్యక్ష ఉపాధ్యక్షులు కిలో పూర్ణచంద్రరావు, ఆంద్రాబు లక్ష్మణ్ లు అన్నారు. సోమవారం వారు మాట్లాడుతూ తెదేపా అభ్యర్థి గిడ్డి ఈశ్వరి నామినేషన్ కార్యక్రమానికి నియోజకవర్గంలోని ఐదు మండలాల నుంచి వేలాదిగా తరలివచ్చిన తెదేపా నాయకులు, కార్యకర్తలు, అభిమానులతో పాడేరు పట్టణం కిటకిటలాడిందన్నారు. అధికార వైకాపా కు దీటైన అభ్యర్థి గిడ్డి ఈశ్వరి అన్నారు. ఆమె అభ్యర్థిత్వం ఖరారు కావడంతోపాటు అధినేత చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా ఆదివారం బీఫారం అందుకున్న ఆమె సోమవారం వేలాదిమంది ప్రజాభిమానుల నడుమ నామినేషన్ వేసిందన్నారు. ఆమె విజయానికి పార్టీ శ్రేణులతో పాటు ప్రతి ఒక్కరు స్వచ్ఛందంగా కృషి చేస్తారని నమ్మకం ఉందన్నారు. ప్రజావాణిని చట్టసభలలో వినిపించగల నాయకురాలు గిడ్డి ఈశ్వరి అన్నారు. ఆమె విజయానికి అన్ని వర్గాల ప్రజల ఆశీర్వాదాలు ఉండాలన్నారు.

బి-ఫారం తీసుకున్న ఎంఎల్ఏ అభ్యర్థి జోగారావు

విశాలాంధ్ర-పార్వతీపురం :పార్వతీపురం నియోజకవర్గం వైఎస్ఆర్సీపీ ఎంఎల్ఏ అభ్యర్థిగా నేడు నామినేషన్ వేయనున్న అలజింగి జోగారావు వైఎస్ఆర్సీపీ పార్టీ బి- ఫారంనువైఎస్ఆర్సీపీ రీజనల్ కో ఆర్డినేటర్ వై వి సుబ్బారెడ్డి చేతుల మీదుగా తీసుకున్నారు. ఈసందర్భంగా ఎంఎల్ఏ అభ్యర్థి జోగారావును నియోజకవర్గంలోని నేతలు కార్యకర్తలు అభిమానులు శ్రేయోభిలాషులు అభినందనలు తెలిపారు.

5వ రోజు రెండు నామినేషన్లు దాఖలు

విశాలాంధ్ర-రంపచోడవరం : రంపచోడవరం అసెంబ్లీ నియోజకవర్గానికి 5వ రోజు రెండు నామినేషన్ పత్రాలు రావడం జరిగిందని రంపచోడవరం అసెంబ్లీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి యస్. ప్రశాంత్ కుమార్ పేర్కొన్నారు. మంగళవారం స్థానిక సబ్ కలెక్టర్ వారి కార్యాలయ సమావేశపుహాలులో 53 రంపచోడవరం అసెంబ్లీ నియోజకవర్గానికి 1.వై.రామవరం మండలం గుర్తేడు పంచాయితీ అల్లూరి గడ్డ గ్రామానికి చెందిన కాకూరు కన్నపురెడ్డి తండ్రి ఎర్రయ్య అనేవారు ఒక్క నామినేషన్ పత్రాన్ని సమర్పించడం జరిగింది. 2. ఎటపాక మండలం చెన్నంపేట గ్రామానికి చెందిన కుంజ శీను తండ్రి కుంజ పడగయ్య ఒక్క నామినేషన్ పత్రాము సమర్పించడం జరిగిందిని రంపచోడవరం అసెంబ్లీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి యస్. ప్రశాంత్‌కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి ఎ.జ్యోతి కృష్ణ, డిప్యూటీ తాసిల్దారులు యస్.వివి సత్యనారాయణ, బి.రాజు, శివ,రామకృష్ణ, చైతన్య, విశ్వనాథ్, సరిత, బాలాజీ, శ్రీధర్, రవీంద్రబాబు, వీరభద్ర రావు,ఎ.సత్యనారాయణ, సీనియర్ సహాయకులు లక్ష్మణరావు, పాలు బాబు అలెగ్జాండర్ తదితరులు పాల్గొన్నారు.

వ్యాధులు ప్రబలకుండా స్ప్రేయింగ్

ఇంకుడు గుంతలలో నిలువ నీటిని పరిష్కరిద్దాం

మలేరియా సబ్ యూనిట్ అధికారి కన్నబాబు

విశాలాంధ్ర-చింతపల్లి : మన్య ప్రాంతంలోనూ మైదాన ప్రాంతానికి దీటుగా ఎండలు మండుతున్న నేపథ్యంలో గడచిన నాలుగు రోజులుగా ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఎండ తీవ్ర ప్రతాపం చూపిస్తున్నప్పటికీ, మధ్యాహ్నానికి ఆకాశం మేఘావృతమై కురుస్తున్న వర్షాల కారణంగా వ్యాధులు ప్రబలకుండా వైద్య ఆరోగ్యశాఖ ముందు జాగ్రత్తగా మన్య ప్రాంతంలో స్ప్రేయింగ్ కార్యక్రమం నిర్వహిస్తుంది. పాడేరు సమీకృత గిరిజనాభివృద్ధి సంస్థ ప్రాజెక్టు అధికారి వి అభిషేక్ ఆదేశాల మేరకు మన్య ప్రాంతంలో దోమల ముందు పిచికారి కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని మలేరియా సబ్ యూనిట్ అధికారి ఆర్ కన్నబాబు అన్నారు. ఆర్వి నగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఎంపీహెచ్ ఈవో జాన్సన్ ఆధ్వర్యంలో మంగళవారం చింతపల్లి-3 సచివాలయం పరిధిలోనీ పెంటపాడు, బుడతలవేనం గ్రామాలలో దోమల ముందు పిచికారి పనులు నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మన్యంలో ఒకవైపు ఎండలు మండుతుండగా మరోవైపు చెదురుమదురు వర్షాలు పడుతున్న నేపథ్యంలో చిన్నపాటి వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉన్నందున ఏమాత్రం చిన్నపాటి నీరసంగా ఉన్నా, జ్వరాలు, దగ్గు జలుబు తదితర రుగ్మతలు ప్రబలిన వెంటనే దగ్గరలో ఉన్న ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్లి వైద్య సేవలు పొందాలని ఆయన సూచించారు. వ్యక్తిగత పరిశుభ్రత తో పాటు, పరిసరాలను పరిశు భ్రంగా ఉంచుకోవాలని, పిచ్చి మొక్కలు, మురుగు కాలువలను తొలగించుకోవాలన్నారు. పిచ్చి మొక్కలు మురుగు కాలువల వలన దోమలు వృద్ధి చెందే అవకాశాలు ఉన్నాయని వాటి వల్ల మలేరియా, ఫైలేరియా, టైఫాయిడ్, డయేరియా, డెంగ్యూ, చికెన్ గున్యా వంటి వ్యాధులు ప్రబలే అవకాశాలున్నాయన్నారు. కాచి చల్లార్చిన నీటిని త్రాగాలని, వేడి పదార్థాలను మాత్రమే భుజించాలని సూచించారు. ఎండ వేడితో పాటు మామిడిపళ్ళ సీజన్ కావడంతో అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో సచివాలయం ఆరోగ్య సంరక్షకురాలు (ఏఎన్ఎం) కోపూరు విజయలక్ష్మి, మలేరియా టెక్నికల్ అసిస్టెంట్ శ్రావణి సంధ్య, హెల్త్ అసిస్టెంట్ కూడా ప్రకాష్, ఆశా కార్యకర్తలు కంకిపాటి రాజేశ్వరి, గుంట సంధ్య పాల్గొన్నారు.